క్లుప్తంగా

విద్యార్థుల మాక్ పార్లమెంట్



మాక్ పార్లమెంట్‌లో పాల్గొన్న విద్యార్థులు

పాల్వంచరూరల్: మండలంలోని వీరూనాయక్ తండా సమీపాన ఉన్న ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం మాక్ పార్లమెంట్ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు అధికార, ప్రతిపక్ష పార్టీల ప్రజాప్రతినిధులుగా వ్యవహరించడం ఆకట్టుకుంది. కళాశాల ప్రిన్సిపాల్ శంకర్ మాట్లాడుతూ.. చట్టసభలపై విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు ఈ కార్యక్రమం నిర్వహించామని తెలిపారు.

ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ కమిటీ ఎన్నిక



ఎన్నికైన కమిటీ సభ్యులు

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి కాలరీస్ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ (1960 /1982) నూతన బ్రాంచి కమిటీ ఎన్నిక శనివారం పెద్దమ్మతల్లి ఆలయం ప్రాంగణంలో జరిగింది. వర్కింగ్ ప్రసిడెంట్‌గా గంగారపు లింగంమూర్తి, రాష్ట్ర ఉపాధ్యక్షుడుగా ఆరెపల్లి రాంచందర్, డిప్యూటీ జనరల్ సెక్రటరీగా గోడ రమేష్, కార్పొరేట్ ఉపాధ్యక్షుడిగా చేనెల్లి మురళి, బ్రాంచి ప్రధాన కార్య దర్శిగా దంసలపూరి వెంకటేష్, కోశాధికారిగా తంగెళ్ల నాగయ్య, 9 మంది కార్యదర్శులను ఎన్నుకున్నట్లు అసోసియేషన్ అధ్యక్షుడు యాట ఓదేలు తెలిపారు.

సీఎంపీఎఫ్ లెక్కలు తేల్చండి..

ఇల్లెందు: కాంట్రాక్ట్ కార్మికులకు సీఎంపీఎఫ్ లెక్కలు తేల్చాలని, జాతీయ పండగలకు మస్టర్ ఇవ్వాలని ఇఫ్టూ అనుబంధ సింగరేణి ప్రగతిశీల కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు యాకుబ్‌షావలీ డిమాండ్ చేశారు. శనివారం ఇల్లెందు ఏరియా సింగరేణి జీఎం కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ధర్నా నిర్వహించి ఎస్‌ఓటూ జీఎం మల్లారపు మల్లయ్యకు వినతిపత్రం అందజేశారు. అనంతరం మాట్లాడుతూ.. నాలుగేళ్లగా సీఎంపీఎఫ్ లెక్కలు తేల్చటం లేదన్నారు. కాంట్రాక్ట్ కార్మికులకు లాభాల్లో వాటా ఇవ్వాలని కోరారు.

పూలే ఆశయాలు సాధించాలి



నివాళులర్పిస్తున్న ప్రజాపంథా నాయకులు

జూలూరుపాడు: సంఘ సంస్కర్త మహాత్మా జ్యోతిరావు పూలే ఆశయ సాధనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు జాటోత్ కృష్ణ అన్నారు. శనివారం జూలూరుపాడు ఏవీఆర్ ఫంక్షన్ హాల్‌లో సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా పార్టీ ఆధ్వర్యంలో జ్యోతిరావు పూలే జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. పూలే చిత్రపటానికి ప్రజాపంథా పార్టీ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. మాట్లాడుతూ.. తన జీవిత భాగస్వామి సావిత్రిబాయి పూలేను ఉపాధ్యాయురాలుగా తీర్చిదిద్ది ప్రోత్సహించిన ఘనత జ్యోతిరావు పూలేదని కొనియాడారు.

ఒక్క అవకాశం ఇవ్వండి..

చుంచుపల్లి: పరాయి వలస పాలనకు వ్యతిరేకంగా తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందని అదే విధంగా కొత్తగూడెంలో సైతం పరాయి నాయకులను పక్కకు పెట్టి ఈసారి బీఎస్పీకి ఒక్క అవకాశం ఇవ్వాలని ఆపార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యెర్రా కామేష్ అన్నారు. శనివారం చుంచుపల్లి మండలం రామాంజనేయ కాలనీలో పర్యటించారు. కామేష్ మాట్లాడుతూ.. అధికారం ఉందనే అహంభావంతో, ఇష్టారాజ్యంగా దోపిడీలు, కబ్జాలు, సెటిల్‌మెంట్లు చేస్తున్నారని ఆరోపించారు. వాటన్నింటిపై నిరంతరం పోరాటం చేస్తూ న్యాయం వైపు నిలబడినట్లు చెప్పారు. భవిష్యత్ తరాల కోసం విలువైన ఓటును ఆయుధంగా మలుచుకొని బీఎస్పీని గెలిపించాలని కోరారు. సోమిడి రాజేష్, ఎం.డి.మక్బుల్, మణి, ఉస్మాన్, జగదీష్, రజియా తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిపై పెట్రోల్ పోసిన దుండగులు

కొత్తగూడెంఅర్బన్: ఒక వ్యక్తిపై, మరో ఇద్దరు పెట్రోల్ పోసి భయభ్రాంతులకు గురి చేశారు. ఫిర్యాదుదారుడి కథనం మేరకు.. మేదరబస్తీకి చెందిన పాన్‌షాప్ నిర్వాహకుడు నరసింగ్ శేఖర్ శనివారం వార్డులో జరిగిన గణేష్ మండపం వద్ద అన్నదానానికి వెళ్లాడు. అక్కడ సంతు దుర్భాషలాడుతూ గొడవకు దిగాడు. దీంతో శేఖర్ ఇంటికి వెళ్లిపోయాడు. అనంతరం సంతు, రాజు కలిసి శేఖర్ పాన్‌షాపు వద్దకు వెచ్చి శేఖర్‌పై పెట్రోల్ పోసి తగలబెట్టాడానికి ప్రయత్నించారు. శేఖర్ తప్పించుకొని వచ్చి త్రీటౌన్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ సంఘటనపై త్రీటౌన్ పోలీసులను వివరణ కోరగా.. దర్యాప్తు చేస్తున్నామని కేసు నమోదు కాలేదన్నారు.

వ్యాధుల కాలం.. అందని వైద్యం

ఏజెన్సీ గ్రామాల ప్రజల ఆరోగ్య పరిరక్షణకు అదే పెద్ద దిక్కు. ఇల్లెందుతోపాటు గుండాల, బయ్యారం, టేకులపల్లి మండలాల నుంచి నిత్యం వందకు పైగా రోగుల తాకిడి. కానీ అక్కడ వైద్యుల కొరత, సౌకర్యాల లేమి వేధిస్తూ బాధితులను 'ప్రైవేటు'కు నడిచేలా చేస్తున్నాయి. ఇదీ మండలంలో ఏజెన్సీ కేంద్రంగా ఉన్న కొమరారం పీహెచ్‌సీ పరిస్థితి.

- ఏకైక డాక్టర్‌తో అందని వైద్యసేవలు
- గత్యంతరం లేక ఆర్‌ఎంపీల చెంతకు బాధితులు
- దయనీయ స్థితిలో కొమరారం పీహెచ్‌సీ



ఏజెన్సీ గ్రామాలకు కేంద్రమైన కొమరారం పీహెచ్‌సీ

ఇల్లెందురూరల్: మండలంలో 24గంటల ఆస్పత్రిగా ఉన్న కొమరారం పీహెచ్‌సీ ప్రస్తుతం రోగలతో కిటకిట లాడుతోంది. ఇల్లెందు మండలం, సమీప మండలాలకు చెందిన శెట్టుపల్లి, కాచనపల్లి, బోడు, మిర్యాలపెంట తదతర ప్రాంతాల నుంచి కొమరారం పీహెచ్‌సీకి ప్రజలు పలు ఆరోగ్య సమస్యలతో ఆస్పత్రికి వస్తుంటారు. ప్రస్తుతం జ్వరాలు అధికంగా నమోదవుతుండటంతో ఓపీ సంఖ్య పెరుగుతోంది. ప్రతిరోజూ 150కి మంచి ఓపీ ఉంటోందని ఆస్పత్రి అధికారులు చెబుతున్నారు.

ఉన్నది ఒక్క వైద్యురాలే..

కొమరారం పీహెచ్‌సీకి నిబంధనల ప్రకారం ముగ్గురు వైద్యుల అవసరం ఉంది. రెండు షిఫ్టులలో ఇద్దరు వైద్యులు విధుల్లో ఉన్నా మరొకరు గ్రామాలలో వైద్యశిబిరాలు నిర్వహించడం, రిలీవర్‌గా ఉండాల్సి ఉంది. కానీ నిన్నటి వరకు ఇద్దరు వైద్యులే సేవలందించారు. ఓపీ అధికంగా ఉంటున్నా.. పట్టించుకోని ఉన్నతాధికారులు ఇద్దరు వైద్యులలో ఒకరిని గుండాలకు బదిలీ చేయడంతో భారమంతా ఒక్కరిపైనే పడుతోంది. దీనికితోడు జ్వరపీడితులు అధికంగా వస్తుండటంతో సిబ్బంది సైతం వైద్యుల పాత్ర పోషించక తప్పడం లేదు.

ఆస్పత్రి కిటకిట... ప్రస్తుతం వాతావరణంలో చోటు చేసుకున్న మార్పుల కారణంగా పల్లెల్లో ఏ ఇంటిని చూసినా జ్వర పీడితులే కనిపిస్తున్నారు. వైద్య శిబిరాలు నిర్వహించి ప్రజలను అప్రమత్తం చేసేందుకు పీహెచ్‌సీలో వైద్యుల కొరత ఉంది. దీంతో చాలామంది మలేరియా, డెంగీ జ్వరాల బారిన పడుతున్నారు. ప్రస్తుతం పీహెచ్‌సీ జ్వర పీడితులతో కిటకిటలాడుతున్నా వారికి అవసరమైన సౌకర్యాలు, సకాలంలో వైద్యం అందడం లేదు. చేసేది లేక వైద్యులు అత్యవసరం ఉన్న వారిని ఆస్పత్రిలో చికిత్స అందిస్తూ మిగతా వారికి ముందులు ఇచ్చి ఇంటికి పంపుతున్నారు. ఇలా ఆస్పత్రిలో ఉన్న వారికి కూడా ప్రతి బెడ్‌ను ఇద్దరికి కేటాయిస్తున్నారు. మరికొందరికి కుర్చీలు వేసి వైద్యం అందిస్తున్నారు. దీంతో కొంత మంది స్థానికంగా ఆర్‌ఎంపీలను ఆశ్రయిస్తుండగా కొంతమంది పట్టణాలకు పరుగులు పెడుతున్నారు.

వేధిస్తున్న అసౌకర్యాలు...

కొమరారం పీహెచ్‌సీలో ప్రస్తుతం ఆరు పడకలు మాత్రమే ఉన్నాయి. కానీ ఆస్పత్రికి ప్రతిరోజూ పదుల సంఖ్యలో జ్వరపీడితులకు వైద్య సేవలు అందించాల్సి రావడం సమస్యగా మారింది. అంతే కాకుండా గదులు కూడా చిన్నవిగా ఉండటంతో పరీక్షలకు వచ్చిన రోగులు వరండాలో గంటల తరబడి నిలబడాల్సి వస్తోంది.

గ్రామీణ వైద్యుల దోపిడీ..

ప్రభుత్వ వైద్యశాలలో వైద్య సేవలు పొందేందుకు గంటల తరబడి నిరీక్షించాల్సి రావడం, తక్కువ సంఖ్యలో పడకలు వంటి అసౌకర్యాలు రోగులను ఆర్‌ఎంపీలను ఆశ్రయించేలా చేస్తున్నాయి. ప్రస్తుతం జ్వరాలు తీవ్రస్థాయిలో ఉండటంతో ఆర్‌ఎంపీలు తమ స్థాయిని విస్మరించి ఎండీ స్థాయిలో వైద్యం చేస్తున్నారు. మలేరియా, డెంగీ వంటి జ్వరాలకు కూడా చికిత్స చేస్తున్నారు. ల్యాబ్ పరీక్షలు, మందుల విక్రయం అన్నీ అక్కడే ఉండటంతో రోగులకు బిల్లుల చెల్లింపు సమయంలో పట్టపగలే చుక్కలు కనిపిస్తున్నాయి. ప్రభుత్వ వైద్యశాలలో సేవలు పూర్తిస్థాయిలో అందకపోవడంతో ఆర్థికంగా భారమైనా ప్రైవేటును ఆశ్రయించాల్సి వస్తోందని ప్రజలు వాపోతున్నారు.



వైద్యాధికారి గదిలో క్యూ కట్టిన బాధితులు

పోస్టులు భర్తీ చేయాలి...

కొమరారం పీహెచ్‌సీలో ప్రస్తుతం వైద్యాధికారులు, పడకలు, అదనపు సిబ్బందిని భర్తీ చేయాల్సిన అవసరం ఉంది. ఆస్పత్రి పరిధి ఎక్కువ గ్రామలకు ఉండటం, రోజువారీ ఓపీ అధికంగా ఉండాన్ని పరిగణలోకి తీసుకొని అదనంగా మరో వైద్యుడిను నియమించడంతోపాటు ఆస్పత్రి ఆవరణలో నిర్మించిన అదనపు షెడ్లలో మరికొన్ని బెడ్లను అందుబాటులోకి తేవాలని వైద్యం కోసం రోగులు కోరుతున్నారు.

ఆస్పత్రిలో పడకలు పెంచాలి



ప్రస్తుతం పల్లెల్లో జ్వరాలు ఉధృతంగా ఉన్నాయి. ప్రతి ఇంట్లోనూ ఒకరిద్దరు మంచాలకే పరిమితమయ్యారు. ఇటువంటి వారు ఆస్పత్రికి వెళితే వైద్యసేవలు అందించేందుకు పడకల కొరత వేధిస్తోంది. ఉన్నతాధికారులు స్పందించి కనీసం తాత్కాలిక పడకలనైనా అందుబాటులోకి తేవాలి.

– మల్లిపెద్ది జాన్‌బాబు, కొమరారం

ఒక్క వైద్యుడు సరిపోవడం లేదు



నిత్యం వందకు పైగా రోగులు హాజరయ్యే కొమరారం పీహెచ్‌సీలో ఒక్క వైద్యుడు సరిపోవడం లేదు. వచ్చిన అందరి రోగులకు న్యాయం చేయలేరు. ఈ కారణంగానే చాలామంది ఆర్‌ఎంపీలను ఆశ్రయిస్తూ జేబులు గుల్ల చేసుకుంటున్నారు. ఉన్నతాధికారులు స్పందించి మరో వైద్యుడిని నియమించాలి.

– మోకాళ్ల కృష్ణ, సర్పంచ్, మాణిక్యారం

3న ఇళ్ల స్థలాల పంపిణీ

కొత్తగూడెంఅర్బన్: సింగరేణి భూనిర్వాసితులకు, రైల్వే బాధితులకు 3వ తేదీన ఇళ్ల స్థలాలు పంపిణీ చేస్తామని కొత్తగూడెం ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు అన్నారు. శనివారం కొత్తగూడెంలో జరిగిన సమావేశంలో మాట్లాడారు. సింగరేణి ఓసీ విస్తరణ వలన చుంచుపల్లి మండలంలోని సింగరేణి ప్రాంతాలైన వనమా కాలనీ, ఎస్ఆర్‌టీ నగర్, మాయా బజార్ ప్రాంతాలలో నివసిస్తున్న వారిని ఖాళీ చేయాలని సింగరేణి సంస్థవారు కోరారని, వారికి ప్రత్యామ్నాయంగా కొత్తగూడెంలో నివాస స్థలాలను ఇవ్వనున్నట్లు చెప్పారు. ఈ విషయంపై ఇటీవల సింగరేణి, రెవెన్యూ అధికారులతో మాట్లాడినట్లు వివరించారు. ఇళ్లు కోల్పోయిన వారికి ప్రత్యామ్నాయంగా స్థలాలను ఇవ్వడం జరుగుతుందని, గృహలక్ష్మి కింద ఇళ్ల నిర్మాణం జరుగుతుందన్నారు. గతంలో కొత్తగూడెంలోని రైల్వే వాళ్ల ఇళ్లు తొలగించడం జరిగిందని, వారికి కూడా ప్రత్యామ్నాయంగా ఇంటి స్థలాలను ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం అధికారులతో కలిసి పంపిణీ చేయనున్న స్థలాన్ని పరిశీలించారు.



ఇళ్ల స్థలాల మ్యాప్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు

మానవహారం చేపట్టి నిరసన

జూలూరుపాడు: ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో జూలూరుపాడులో శనివారం ఆశా కార్యకర్తలు మానవహారం చేపట్టి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షురాలు పూనెం ఝాన్సీ మాట్లాడుతూ.. తమ న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలన్నారు. ఆశా కార్యకర్తలకు పారితోషకంగా రూ.18,000, ఫిక్స్‌డ్ వేతనం నిర్ణయించాలన్నారు. ఆశా కర్యకర్తల నిరవధిక సమ్మెకు సీపీఐ (ఎంఎల్) ప్రజా పంథా పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు జాటోత్ కృష్ణ, మండల కార్యదర్శి బానోత్ ధర్మా, ఐఎఫ్‌టీయూ జిల్లా సహాయ కార్యదర్శి వై.గోపాల్‌రావులు సంఘీభావం తెలిపారు.

అంగన్‌వాడీలు...

సుజాతనగర్: న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ అంగన్‌వాడీ ఉద్యోగులు చేపట్టిన నిరవధిక సమ్మె శనివారం 20వ రోజుకు చేరుకంది. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని ప్రధాన రహదారిపై అంగన్‌వాడీ సిబ్బంది మానవహారం చేపట్టారు. ఎండలో మేము... ఏసీలో మీరా... భగభగమండే సూర్యుని చూడు... అంగన్‌వాడీల ఆగ్రహం చూడు... అంటూ నినాదాలు చేశారు. సీఐటీయూ జిల్లా నాయకుడు వీర్ల రమేష్ మాట్లాడుతూ.. 20 రోజులుగా అంగన్‌వాడీలు సమ్మె చేస్తున్నా ప్రభుత్వానికి చీమ కుట్టినట్లయినా లేదని విమర్శించారు. డిమాండ్లను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

అక్రమ అరెస్టులను ఖండించండి



ఇల్లెందురూరల్: మానవహారం చేపట్టిన అంగన్‌వాడీ, మధ్యాహ్న భోజన వర్కర్లు

జూలూరుపాడు: రాష్ట్ర ఐటీ మంత్రి కేటీఆర్ ఉమ్మడి ఖమ్మం జిల్లా పర్యటన సందర్భంగా ఎస్ఎఫ్ఐ నాయకులను ముందస్తుగా అరెస్టు చేయడం పట్ల ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు గార్లపాటి పవన్ కుమార్ తీవ్రంగా ఖండించారు. శనివారం ఆయన మాట్లాడుతూ.. అక్రమ అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరన్నారు. అరెస్టు అయిన వారిలో బోడా అభిమిత్ర, పెరుమాళ్ల పవన్ కుమార్ ఉన్నారు.

ఫహీమ్ దాదాను విడుదల చేయాలి..

మంత్రి కేటీఆర్ పర్యటన సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ఫహీమా దాదాను అక్రమంగా అరెస్టు చేయడం సరైన విధానం కాదని ఆ సంఘం జిల్లా సహాయ కార్యదర్శి గుగులోత్ వంశీ అన్నారు. శనివారం జూలూరుపాడులో ఏఐఎస్ఎఫ్ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు.

ఇల్లెందురూరల్: మంత్రి కేటీఆర్ పర్యటన నేపథ్యంలో సీఐటీయూ నాయకులను అక్రమంగా పోలీసులు అరెస్టు చేయడాన్ని నిరసిస్తూ అంగన్‌వాడీ ఉద్యోగులు, మధ్యాహ్న భోజన వర్కర్లు శనివారం ఇల్లెందులో మానవహారం చేపట్టారు. సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి అబ్దుల్ నబీ మాట్లాడుతూ.. అరెస్టులు, నిర్బంధాల ద్వారా ఉద్యమాలను అణిచి వేయలేరన్నారు.

టేకులపల్లి: జిల్లాలో రాష్ట్ర ఐటీ మంత్రి కేటీఆర్ పర్యటన నేపథ్యంలో శనివారం టేకులపల్లి పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు. టీఎస్‌టీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఇస్లావత్ లక్ష్మణ్ నాయక్, టీపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి గుగులోత్ హరిలాల్, సీఐటీయూ, అంగన్‌వాడీ, ఆశా వర్కర్, మధ్యాహ్న భోజన వర్కర్స్ యూనియన్ నాయకులు కడుదుల వీరన్న, కొండపల్లి శకుంతల, లాకావత్ లక్ష్మీ తదితరులను పోలీసులు అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు.

సుజాతనగర్: మంత్రి కేటీఆర్ పర్యటన దృష్ట్యా ఎల్‌హెచ్‌పీఎస్, తుడుందెబ్బ రాష్ట్ర నాయకులను స్థానిక పోలీసులు శనివారం అదుపులోకి తీసుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గుగులోత్ రాజేష్ నాయక్, ఆదివాసీ హక్కుల పోరాట సమితి (తుడుందెబ్బ) రాష్ట్ర అధ్యక్షుడు కొమరం బుచ్చయ్య దొర మాట్లాడుతూ.. అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరని, గిరిజనుల హక్కుల సాధనకై నిరంతరం ఉద్యమాలు చేయనున్నట్లు తెలిపారు.

'అక్కినేని' పురస్కారం అందుకున్న శివకుమార్

కొత్తగూడెంరూరల్: కొత్తగూడెంకు చెందిన మద్దెల శివకుమార్‌కు అక్కినేని స్ఫూర్తి పురస్కారాన్ని అందుకున్నారు. సామాజిక సేవలో రాణిస్తున్న ఆయనకు హైదరాబాద్‌లో ఇటీవల నిర్వహించిన అక్కినేని శత జయంతి ఉత్సవాల్లో స్ఫూర్తి పురస్కారాన్ని డాక్టర్ వంశీ రామరాజు అందజేసి సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆమని, చంద్రతేజ, ఆమని, గొల్లపల్లి దయానందరావు, భోగరాజు పాల్గొన్నారు.

ఎల్‌ఈడీ స్ట్రీట్ లైట్లు పంపిణీ



లైట్లు అందజేస్తున్న వెంకటేశ్వరరెడ్డి

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం ఏరియాలో పరిధిలోని పీవీకే-5 ఇంక్‌లైన్, వీకే-7 ఇంక్‌లైన్, జీకేఓసీ గనుల చుట్టుపక్కల గ్రామాలకు కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబులిటీ (సీఎస్సార్) పాలసీ కింద ఎల్‌ఈడీ స్ట్రీట్ లైట్లను శనివారం సింగరేణి డైరెక్టర్ ప్రాజెక్ట్ అండ్ ప్లానింగ్ జి.వెంకటేశ్వరరెడ్డి పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏరియా జనరల్ మేనేజర్ ఎం.శాలేంరాజు, ఎస్ఓటూ జీఎం కోటిరెడ్డి, ఏజీఎం దుర్గాప్రసాద్, ఏజెంట్ రవీందర్, పర్సనల్ మేనేజర్ శివకేశవరావు, కొత్తగూడెం మున్సిపల్ చైర్‌పర్సన్ కావు సీతాలక్ష్మి, ఎండీ రజాక్, కాపు కృష్ణ జే.గట్టయ్య, ఎం.అశోక్, కే.శ్రీనివాస్, అంబేద్కర్, సర్పంచులు పాల్గొన్నారు.

డెంగీ రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

కొత్తగూడెంఅర్బన్: డెంగీ రాకుండా ప్రతిఒక్కరూ తగిన జాగ్రత్తలు తీసుకోవాలని 35వ వార్డు కౌన్సిలర్ రుక్మాంగధర్ బండారి అన్నారు. శనివారం వార్డులో డెంగీ వచ్చిన వారి నివాసంలో, పరిసర ప్రాంతంలో దోమల నివారణ మందు పిచికారీ చేయించారు. కౌన్సిలర్ మాట్లాడుతూ.. డెంగీ జ్వరం రాకుండా ఉండాలంటే పరిసరాల్లో నీరు నిల్వ లేకుండా చూసుకోవడం, కూలర్, ఖాళీ కొబ్బరిబోండాల్లో నీటిని తొలగించాలన్నారు.

ప్రభుత్వాస్పత్రిలో చెత్త తొలగింపు

పాల్వంచ: ప్రభుత్వాస్పత్రి ఆవరణమంతా పిచ్చి మొక్కలు పెరిగి అధ్వానంగా తయారైంది. దీంతో దోమలు విపరీతంగా పెరిగాయి. జ్వరాలు, ఇతర అనారోగ్యాలతో ఆస్పత్రికి వచ్చే వారిని ఆరోగ్యం దృష్ట్యా ఆస్పత్రి వైద్యురాలు సూకల సింధు సౌజన్యంతో డోజర్‌తో ఆస్పత్రి ఆవరణలోని ఉన్న చెత్తచెదారాన్ని, పిచ్చి మొక్కలను తొలగించి శుభ్రం చేయించారు. కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ముక్కంటేశ్వరరావు, కొప్పుల రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

జ్వరపీడితులతో ప్రభుత్వాస్పత్రి కిటకిట

ఇల్లెందు: ఇల్లెందు ప్రభుత్వాస్పత్రి జ్వరపీడితులతో నిండిపోయింది. మంచానికి ఇద్దరు చొప్పున ఉన్నారు. కొంతమందికి బెడ్లు లేకపోవడంతో కుర్చీల మీదనే కూర్చొబెట్టి సెలెన్ ఎక్కిస్తున్నారు. వారం, పదిరోజులుగా జ్వరపీడితుల సంఖ్య బాగా పెరిగింది. చుట్టు పక్కల గ్రామాల నుంచి వందల సంఖ్యలో జ్వరపీడితులు వైద్యం కోసం ఆస్పత్రికి వస్తున్నారు. అందరికీ వైద్యం అందించటం కష్టంగా మారింది.

వార్డుల్లో రోగులకు బెడ్లు లేవు...

ఒక రోగి బెడ్డు వదిలేస్తే మరో రోగి క్యూ కట్టి నిలబడి బెడ్డు కోసం ఎదురు చూస్తున్న పరిస్థితి. ఆస్పత్రి అంతా జ్వరపీడితులే. అయినా ఒకే ఒక్క నర్సు వైద్యం అందిస్తోంది. జ్వరపీడితుల కోసం రెండు వార్డులు ఉన్నాయి. ఈ రెండు వార్డులలో కూడా 10 మంచాలే ఉన్నాయి. టెస్టుల వద్ద 11గంటల లోపు వచ్చిన వారికే రక్త నమూనాలు తీసుకుంటున్నారు. ఆ తర్వాత వస్తే మరుసటి రోజు రమ్మంటున్నారు. తక్షణం ఆస్పత్రిలో అదనపు బెడ్లు ఏర్పాటు చేయాలని కలెక్టర్ వెంటనే తనిఖీకి రావాలని ఇక్కడి రోగులు కోరుతున్నారు.



కుర్చీలో కూర్చుని సెలైన్ ఎక్కించుకుంటున్న బాధితులు

ఈ-పంచాయతీ ఆపరేటర్ల సమ్మె ప్రారంభం



సమ్మెలో పాల్గొన్న ఈ-పంచాయతీ ఆపరేటర్లు

చుంచుపల్లి: తెలంగాణ ఈ- పంచాయతీ టెక్నికల్ వింగ్ రాష్ట్ర కమిటీ నిర్ణయం మేరకు శనివారం ఈ-పంచాయతీ కంప్యూటర్ ఆపరేటర్లు విధులను బహిష్కరించి శాంతియుత సమ్మె దిగారు. కలెక్టరేట్ ఎదుట ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన టెంట్ వద్ద నిరసన కార్యక్రమాలు చేపట్టారు. అంతకుముందు పాల్వంచలోని డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ విక్రమ్ మాట్లాడుతూ.. ప్రభుత్వం ఈ ఆపరేటర్ల సమస్యలు పరిస్కరించి పే-స్కేల్ అమలు చేసి ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. మహిళా ఉద్యోగులందరికీ వేతనంతో కూడిన ప్రసూతి సెలవులు ఇవ్వాలని, ఉద్యోగుల్లో ఎవరైనా ప్రమాదవశాత్తు మరణిస్తే వారి కుటుంబంలో ఒకరికి కారుణ్య నియామకం కింద ఉద్యోగం కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కిషోర్, క్రాంతి, కిరణ్, చంద్రకళ, అనీషా, జిల్లాలోని కంప్యూటర్ ఆపరేటర్లు పాల్గొన్నారు.

ఉద్యమాలను మరింత ఉధృతం చేస్తాం..

పాల్వంచ: మంత్రి కేటీఆర్ పర్యటన నేపథ్యంలో సీఐటీయూ నేతల అరెస్ట్‌కు నిరసనగా పట్టణంలోని అంబేద్కర్ సెంటర్‌లో ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. శనివారం నాయకులు దొడ్డా రవికుమార్ తదితరులను పోలీసులు అరెస్ట్ చేసి స్టేషన్‌లో ఉంచడంతో నిరాహార దీక్షలు చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశా వర్కర్లు కలిసి పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం అంబేద్కర్ సెంటర్‌లో ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. సీఐటీయూ నాయకుడు అన్నవరపు సత్యనారాయణ మాట్లాడుతూ.. ప్రభుత్వం నిరంకుశ వైఖరి వీడాలన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తల సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం పట్టనట్లు వ్యవహరించడం సరికాదన్నారు. రానున్న రోజుల్లో ఉద్యమాలు ఉధృతం చేస్తామన్నారు. కార్యక్రమంలో నిరంజన్, తులసీ రాం, రహీం, శాంతి, వెంకటరమణ, నారాయణ, అచ్చమ్మ, రమ్య, సుజాత, రమణ తదితరులు పాల్గొన్నారు.



ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం చేస్తున్న నాయకులు

అవకతవకలను అరికట్టండి



ధర్నా చేస్తున్న యాదవ సంఘం నాయకులు

సూపర్‌బజార్(కొత్తగూడెం): జిల్లా గొర్రెల సహకార సంఘాల ఆధ్వర్యంలో జిల్లా అఖిల భారత యాదవ మహాసభ నాయకత్వంలో శనివారం జిల్లా పశుసంవర్ధక శాఖ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. రెండో విడత గొర్రెల పంపిణీ పథకంలో జరుగుతున్న అవకతవకలను అరికట్టాలని, లబ్ధిదారునికి పక్క రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్ నుంచి గొర్రెలను కొనుగోలు చేయాలని, డీడీలు కట్టిన ప్రతిఒక్కరికీ గొర్రెల యూనిట్లను సత్వరమే ఇప్పించాలని నినాదాలు చేశారు. అఖిల భారత యాదవ మహాసభ రాష్ట్ర నాయకుడు మచ్చా శ్రీనివాసరావు క్షేత్రస్థాయిలో ఎదుర్కొంటున్న ఇబ్బందులను జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి పురంధర్‌కు వివరించారు. సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో పరమేష్ యాదవ్, వల్లపు యాకయ్య యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఓసీ నిర్వాసితులుగా గుర్తించండి

ఇల్లెందురూరల్: జేకే ఓసీ నిర్వాసితులుగా తమను కూడా గుర్తించాలని డిమాండ్ చేస్తూ తిలక్‌నగర్ గ్రామపంచాయతీ ప్రజలు శనివారం సింగరేణి జీఎం, తహసీల్దార్ కార్యాలయాల వద్ద ధర్నా చేశారు. డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అధికారులకు అందజేశారు. సర్పంచ్ ధనసరి స్రవంతి మాట్లాడుతూ.. సింగరేణి సంస్థ జేకే ఓసీ ఏర్పాటు కోసం చేపట్టిన భూసేకరణలో విజయలక్ష్మీనగర్ ప్రాంతంలో అత్యధిక భాగం, తిలక్‌నగర్ గ్రామపంచాయతీలో స్వల్పంగా నిర్వాసిత ప్రాంతంగా ప్రకటించిందని గుర్తుచేశారు. కానీ సంస్థ ఆవిర్భావ సమయంలో ఏర్పడిన ఈ ప్రాంతంలో నాడు నివాసం ఉన్న కార్మికుల కోసం సంస్థ నిర్మించిన క్వార్టర్లు కూడా ప్రస్తుతం శిథిలావస్థకు చేరుకున్నాయన్నారు. ఆయా క్వార్టర్లతోపాటు సొంతంగా నిర్మించుకున్న గృహాలలో ప్రజలు నివాసం ఉంటున్నట్లు తెలిపారు. గతంలో సింగరేణి సంస్థ ఈ ప్రాంత భూఅంతర్భాగంలో బొగ్గు తవ్వకాలు చేపట్టిందన్నారు. ప్రస్తుతం జేకే ఓసీ నిర్వాసిత ప్రాంతానికి ఆనుకొని ఉన్న ఈ ప్రాంతంలో బొగ్గు తవ్వకాల సమయంలో నివాస గృహాలు పూర్తిగా నేలమట్టమయ్యే దుస్థితి ఉంటుందని వాపోయారు. ఈ కారణంగా నిర్వాసిత ప్రాంతంగా గుర్తించి న్యాయం చేయాలని కోరారు. లేదంటే ఉద్యమం ఉధృతం చేసి ఓసీ ఏర్పాటును అడ్డుకుంటామని హెచ్చరించారు.



తహసీల్ ఎదుట ధర్నా చేస్తున్న తిలక్‌నగర్ గ్రామపంచాయతీ ప్రజలు

రుణాలు అందజేత

జూలూరుపాడు: జూలూరుపాడు సహకార సంఘం పరిధిలో రుణమాఫీ పొందిన రైతులకు తిరిగి రుణాలను ఆ సంఘం చైర్మన్ లేళ్ల వెంకటరెడ్డి శనివారం అందజేశారు.

ఈ సందర్భంగా సహకార సంఘం చైర్మన్ వెంకటరెడ్డి మాట్లాడుతూ.. సహకారం సంఘంలో 949 మంది రైతులకు రూ.3.79 కోట్లు రుణమాఫీ వచ్చిందన్నారు. రుణమాఫీ పొందిన 102 మంది రైతులకు తిరిగి రూ.60 లక్షలు రుణం ఇవ్వడం జరిగిందన్నారు. కార్యక్రమంలో సొసైటీ సీఈఓ రమణారెడ్డి, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.



రుణాలు అందజేస్తున్న లేళ్ల వెంకటరెడ్డి

ప్రభుత్వం మూల్యం చెల్లించక తప్పదు



సమ్మెకు సంఘీభావం తెలుపుతున్న శ్రీనివాస్

టేకులపల్లి: అంగన్‌వాడీ, ఆశా, మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించకపోతే తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రేపాకుల శ్రీనివాస్ హెచ్చరించారు. ఈ మేరకు శనివారం అంగన్‌వాడీ, ఆశా, మధ్యాహ్న భోజన కార్మికుల సమ్మె శిబిరాలను సందర్శించి సంఘీభావం తెలిపారు. మాట్లాడుతూ.. సమ్మె కార్మికుల ప్రాథమిక హక్కు అన్నారు, సమ్మె చేయాల్సి వచ్చిందంటే ఆ కార్మికుల పట్ల ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరే కారణమన్నారు. కనీస వేతనం, పర్మనెంట్ చేయాలని అడగడం గొంతెమ్మ కోరిక కాదన్నారు. ఎన్నాళ్లు ఇలా వెట్టి చాకిరీ చేయించుకుంటారని ప్రశ్నించారు. ఢిల్లీలో రైతులు చేసిన పోరాట స్ఫూర్తితో పోరాడాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం వెంటనే కార్మిక సంఘాల నాయకులతో చర్చలు జరిపాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కడుదుల వీరన్న, ఈసం నర్సింహారావు, కొండపల్లి శకుంతల, కె.రాజేశ్వరి, పి.రాజేశ్వరి, ఐ.రాధ, వై.ఇందిర, వై.పద్మ, సంధ్యారాణి, ఎస్.విజయలక్ష్మి, ఈసం రాణి, సోన నాగలక్ష్మి, భద్రమ్మ, పూనెం హైమావతి, మజహరి, మంగతాయి, తదితరులు పాల్గొన్నారు.

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నెంబర్లకు ఉదయం 7-00 గం॥ల నుండి రాత్రి 8-00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే చర్యలు తీసుకోబడును.

కె. ప్రదీప్ కుమార్, ACM - 70132 21824
లక్ష్మయ్య, ACO - 8074270476
కొత్తగూడెం యాకూబ్ పాషా - 80083 21148
భద్రాచలం కె. హరేంద్ర - 99632 02011
పినపాక ఎన్. లక్ష్మయ్య - 80742 70476
ఇల్లందు బి. కిషన్ - 63052 41411
అశ్వారావుపేట ఎన్. దుర్గారాంప్రసాద్ -79979 58226
టోల్‌ఫ్రీ నెం.: 1800 270 1083

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
Land Line : 08742-282823 / 24

మీరు సాక్షిలో వివాహ, జన్మదిన, పదవీ విరమణ, విదేశీ పర్యటన, స్వదేశాగమనం, అవార్డు గ్రహీతలకు శుభాకాంక్షలు, మీ ఆత్మీయులకు శ్రద్ధాంజలి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, బహిరంగ ప్రకటనలు, అతి తక్కువ ఖర్చుతో కొండత స్పందన లభించే క్లాసిఫైడ్ యాడ్స్ ఇవ్వదలచినచో మీరు సంప్రదించవలసిన ఫోన్ నెంబర్లు : ఎన్. నాగశేషు, యాడ్స్ మేనేజర్- 99122 20600

టి. రాజేష్ - 90102 23783
ఎ. నాగేశ్వరరావు - 97054 44183
ఎన్. శేషయ్య - 99121 99148